గమ్యం స్థిరంగా ఉండాలి, ప్రయత్నంలో రాజీ ఉండకూడదు, అప్పుడే విజయం మనదవుతుంది

- రామకృష్ణ పరమహంస


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 183 | గురువారం, 19, ఫిబ్రవరి 2026 , | పేజీలు - 06 | వెల : 3/-


### కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు ఖరారు

## రేవంత్ కోరుకున్న వారికే

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఏకపక్షంగా విజయం సాధించటంతో అధినాయకత్వం ఇక కొత్త నిర్ణయాలతో సిద్దం అవుతోంది. అందులో భాగంగా ప్రభుత్వం.. పార్టీలో రేవంత్ కోరుకున్న విధంగా పదవుల ఖరారు.. మార్పుల దిశగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో.. ప్రస్తుతం కేబినెట్ లో ఉన్న ఖాళీల భర్తీతో పాటుగా రెండు మూడు మార్పులు ఖాయంగా కనిపిస్తోంది. పార్టీ.. ప్రభుత్వంలో కీలక పదవులను భర్తీ చేసేందుకు తుది కసరత్తు జరుగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నేతలతో కలిసి ఢిల్లీలో మకాం వేసారు. ఇక.. రాజకీయంగా మరింత బలోపేతం కావాలని రేవంత్ భావిస్తున్నారు. అందుకు హైకమాండ్ సైతం ఫ్రీ హ్యాండ్ ఇచ్చేలా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా కేబినెట్ విస్తరణ.. నామినేటెడ్ పదవుల్లో రేవంత్ లిస్టుకు ఆమోదం తెలిపేందుకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అయితే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చిన సమయంలో సీనియర్లకు నామినేటెడ్ పదవులు అప్పగించారు.




## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

**● తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ ● మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18 :** దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్య సభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రా ల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నా యి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది.

మిగతా2లో...

### పట్టణాభివృద్ధిలో తెలంగాణ

# దేశానికే ఆదర్శం

**● గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం ● నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ... ● అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన**

**● ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి**




**ముంబయి,ఫిబ్రవరి 18 :** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణ మైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్యం÷-ర అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐఎం,ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్,

మిగతా2లో...

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

**● ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి ● ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం, డిప్యూటి సిఎం**



**విశాఖపట్నం,ఫిబ్రవరి 18 :** దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్య ంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దు ల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొ ని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన

మిగతా2లో...

## దళిత నాయకుడు బాల్క అరెస్టు దుర్మార్గం

**- కాంగ్రెస్ అక్రమాలను ఎదరించినందుకు అరెస్టా**

**- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 :** క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యల ను అడ్డుకున్నందుకు మాజీ శాసన సభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్‌ను అరెస్టు చేసి

మిగతా2లో...



2లో

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

**● యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు ● సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల నిరంతర పరిశీలన ● లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం ● సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం జరగాలి ● దేశంలో నే మోడల్ గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ● ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం**



### ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు

## సుందర్ పిచాయ్

**ప్రధాని మోడీతో భేటీ అయినట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18 :** సాంకేతిక ప్రపంచంలో భారత్ తన ముద్ర వేస్తోంది. ఇందులో భాగం గా.. గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బుధవారం న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోదీ-సుందర్ పిచాయ్ మధ్య జరిగిన ఈ సమావేశం ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల

మిగతా2లో...

### పారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర

# పోలీస్ స్పోర్ట్స్ మీట్

**ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి**

**33 జిల్లాల నుండి 2,532 మంది క్రీడాకారుల భాగస్వామ్యం**



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026' సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని క్రీడాకారులు,

మిగతా2లో...

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

**- శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,18 :** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ మైన సందర్భంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమ ణులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమ శిక్షణను పెంచుతాయ న్నారు. లౌకిక వాదం, మత సామరస్య పరిర క్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ముస్లీం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం



**తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం**

**అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు**

**కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,ఫిబ్రవరి 18 :** తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాం÷-రతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని , భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్

మిగతా2లో...

## ధరణి దోపిడిపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని ,ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని, ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తా మని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ , సిఎం ఆర్ వో మందా మకరంద్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారా యని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పా దక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుం దన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్,ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా ప్రకటించగా, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశిరచినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా ప్లస్ 1 కు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమా ల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతా వరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దు తామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బ్జడెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారు ద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బ్జడెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బ్జడెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకు రావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అను సంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగు తుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్యలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్య ంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయి ల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం బీసీ లకు బ్జడెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తుంది.

## 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

### దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే

### తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం

### బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వా మ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్‌ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా , వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రెడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపె÷-లలెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజర య్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది.తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీ కాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు , తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు పక్రియ ఉంటుంది.

## విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

(మొదటి పేజీ తరువాయి)

45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణిం చారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

## ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

(మొదటి పేజీ తరువాయి)

చుట్టూ సాగినట్లు సమాచారం. భారత్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు చేరుకున్నారు. సుందర్ పిచాయ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో 20న కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత దేశానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. ఎప్పటిలాగే చాలా మంది మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నారు' అంటూ రాసుకొచ్చారు. ఈ సదస్సులో 110కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి.

## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల మధ్య డీజీపీ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీజీపీ డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా కార్యక్రమానికి హాజరైన వారందరినీ అభినందించారు. ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు మరియు సమ్మక్క-సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడం తో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పథకాలు సాధించడం కంటే కూడా మంచి స్నేహితులను సాధించడం గొప్ప అన్నారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలోనూ పెరగాలని, ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను చాటుకోవాలని సూచించారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి, ఐక్యత మరియు పరస్పర గౌరవం ముఖ్యమని, ఇదే స్ఫూర్తిని వృత్తిలోనూ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

## దళిత నాయకుడు బాల్క అరెస్టు దుర్మార్గం

(మొదటి పేజీ తరువాయి)

నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ, కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పును కాలరాస్తున్న తీరుకు నిదర్శనాలు ఎన్నోనని అన్నారు. జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు. ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు

- ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభం
- స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 18:** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించామన్నారు. సమాచారశాఖ వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు లను ఆ÷-లనైన్ లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ పక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగంలో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

DD9 వార్త

గురువారం
ఫిబ్రవరి 19 2026



# విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి ఆటోలు, మినీ క్యాబ్‌లపై విస్తృత తనిఖీలు





**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** జిల్లాలో ఆటో రిక్షాలు మరియు ఇతర వాహనాల ద్వారా ప్రయాణించే విద్యార్థుల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని జిల్లా రవాణా అధికారి ఆదేశాల మేరకు ఆటో రిక్షాలు, మినీ క్యాబ్‌లపై విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహి ంచారు. ఈ తనిఖీల సందర్భంగా మద్నూర్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు వాహనాలను అధికారులు గుర్తించారు. సహాయక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రఫీ, ఉదయ్ సంబంధిత వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఆటో అడ్డాల వద్ద డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా రవాణా అధికారి కె. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో వారు సురక్షితమైన, అనుమతులున్న వాహనాలలోనే ప్రయాణిస్తున్నారా అన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అలాగే రహదారి భద్రతా నియ మాలను కచ్చితంగా పాటిస్తూ రవాణా శాఖకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశా రు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# వ్యవసాయ పంట నమోదు వాలంటీర్ల నియామకాలు



**ఆదిలాబాద్ జిల్లా బోథ్ :( డిడి 9 వార్త ) :** సోనాల మండల కేంద్రం లొ టీపీసీసీ సోషల్ మీడి యా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ రాష్ట్రంలో పంట నమోదు సర్వే కోసం కోసం ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున 10909 మంది వాలంటీర్లను నియమి ంచాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది కాబట్టి నిరుద్యోగ యువకులకు ఇది సువర్ణ అవకాశం కాబట్టి దీన్ని బీఎస్సీ అగ్రికల్చరల్, చేసినవారు లేదా బీఎస్సీ డిగ్రీ చేసినవారు తమ మండల కేంద్రంలో గల వ్యవ సాయ అధికారులకు అప్లికేషన్ పెట్టుకొని ఈ అవకాశాన్ని వినియోగించాలని వాలెంటర్ వ్యవస్థను తీసుకొచ్చి వ్యవ సాయ నమోదును సులభతరం చేసిన రాష్ట్ర మంత్రివర్యులు రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# కల్లూరులో ఉచిత కంటి పరీక్షల శిబిరం

## 86 మందికి పరీక్షలు,18 మందికి శస్త్రచికిత్సకు రిఫర్






**బీర్కూర్, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** బుధవారం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కల్లూరు గ్రామంలో కొత్తగా వచ్చిన ఏటివో ఏఆర్ పరికరంతో కంటికి సంబంధించిన స్పెరికల్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 86 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో మోతిబిందు సమస్య ఉన్న 18 మందిని శస్త్రచికిత్స కోసం బోధన్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు అజయ్ సర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, సభ్యులు బస్వంత్ పటేల్, కిరణ్, సుధాకర్ రెడ్డి, బోధన్ లయన్స్ క్యాంప్ ఇంచార్జీ హన్మంతు రావ్ పటేల్ పాల్గొన్నారు. అలాగే ఆశా వర్కర్లు, గ్రామ సర్పంచ్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ లింగప్ప పటేల్, ఉపసర్పంచ్, గ్రామ ప్రజలు మరియు యువకులు హాజరయ్యారు

# పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేసిన ఎం.ఏ.హకీమ్







**పోతంగల్, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో సామాజిక సేవకుడు, బీఆర్ఎస్ మండల నాయకుడు ఎం.ఏ.హకీమ్ పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన పాత పోతంగల్ గ్రామానికి చెందిన పగల నవీన్ ముదిరాజ్ దంపతులను పరామర్శించారు. వారి బిడ్డకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో రెండు పేగు శస్త్రచికిత్సలు జరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకుని రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన మ్యాదారి సాయవ్వకు కంటి ఆపరేషన్‌కు అవసరమైన ఖర్చుల కోసం రూ.5,000 అందించారు. ఆఫ్రీన్ అనే మహిళకు నెలరోజుల కిరాణా సరుకుల కోసం రూ.6,000 సాయం చేశారు. జల్లపల్లి గ్రామానికి చెందిన అజ్మేరి మహిళకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హకీమ్ మాట్లాడుతూ, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే ముందుకు వచ్చి ఆదుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్బశేఖర్, సోప గణేష్, పైదూల, యూసుఫ్, జునైద్, మాజీ ఎంపీటీసీ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలిం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** జిల్లాలో చేపడుతున్న వివిధ శాఖల అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుమోహన్, సీఈఓ చందర్, డీఆర్‌డీఓ సురేందర్, పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.
సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ రికవరీ తదితర అంశాలపై సమీక్షించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లు, మోటార్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మత్తులు పూర్తి చేసి అవసరమైన చోట ప్రత్యామ్నాయ త్రాగునీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని, అర్హులైన లబ్ధిదారులకు సమయానికి గృహాలు అందేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ రికవరీ వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అలాగే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి త్రాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో పనుల పురోగతి తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ఫీల్డ్ అధికారులు ఉదయం 9 గంటలలోపు క్షేత్రస్థాయిలో ఉండాలని, ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పురస్తు సంఘం ఆధ్వర్యంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు ఘన సన్మానం








**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** భీంగల్ మున్సిపల్ పట్టణంలో బుధవారం పురస్తు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పలువురు కౌన్సిలర్లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే గంగమణి స్వామి, 5వ వార్డు కౌన్సిలర్ బోధిరే లావణ్య నర్సయ్య, 9వ వార్డు కౌన్సిలర్ నీలం రవి, 12వ వార్డు కౌన్సిలర్ మల్లెల అనుపమ ప్రసాద్‌లను సంఘం సభ్యులు శాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పురస్తు సంఘం సభ్యుల సహకారంతోనే తాము విజయం సాధించామని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని తెలిపారు. సంఘం సభ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటామని, భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి మరియు సభ్యుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎల్ల వేళలా ఉంటుందని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్ద కాపులు తోట గంగాధర్, పురస్తు లింబాద్రి, పురస్తు సురేష్‌లతో పాటు సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జిల్లాలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు (ఉదయం 9.30 – 12.30), ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు (ఉదయం 9.00 – 12.00) జరగనున్నాయని, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 36,963 మంది, పదో తరగతిలో 24,542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కోసం 58 కేంద్రాలు, పదో తరగతి కోసం 144 కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసి ఉంచాలి. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించకూడదు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపాలి. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులు నడపాలని, పరీక్షా సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్ మధ్య సురక్షితంగా తరలించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్. కిరణ్ కుమార్, కమిషనర్ దిలీప్ కుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ రవికుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంరోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ఆదిలాబాద్ జిల్లా : (డిడి 9 వార్త ) :**రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం దన్నూర్ (బి) గ్రామానికి చెందిన దోపతి సురేందర్(30) బుధవారం బైక్‌పై వెళుతుండగా వేంకటేశ్వర ఆలయ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు మృతుడికి మార్చి 9న వివాహం జరగాల్సి ఉంది. సురేందర్ మరణించడంతో కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది.

## కోటగిరి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం



**పోతంగల్,ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కోటగిరి గ్రామానికి చెందిన కాసుల మౌనిక (మున్నూరు కాపు, గృహిణి) కనిపించకుండా పో యిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగి స్తోంది. వివరాల ప్రకారం, ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమ యంలో డ్వాక్రా గ్రూప్ లోన్ డబ్బులు తీసు కువస్తానని ఇంటి నుంచి వెళ్లిన మౌనిక తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త కాసుల ప్రశాంత్ (తండ్రి సాయిలు, వయ స్సు 30 సంవత్సరాలు) స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ఎస్సై సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వైద్య సేవలకు నాలుగేళ్లు పూర్తి సెవెన్ హిల్స్ హాస్పిటల్‌కు ప్రశంసలు



**బాన్సువాడ, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** పట్టణ ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందిస్తూ నాలుగేళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న బాన్సువాడ పట్టణ కేంద్రంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిచ్కుందకు చెందిన సోమయప్ప స్వామి హాస్పిటల్‌ను సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించారు.సందర్శనలో భాగంగా ఆయన ఐసీయూ, జనరల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్ వంటి ముఖ్య విభాగాలను పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులతో మాట్లాడిన సోమయప్ప స్వామి,ఆరోగ్య రంగంలో సేవా దృక్పథంతో పనిచేస్తు న్నందుకు అభినందనలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటలపాటు వైద్య సేవలు అందిస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలలోనూ చురు కుగాపాల్గొంటున్న సంస్థగా సెవెన్ హిల్స్ హాస్పిటల్ నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో హాస్పిటల్ కీలక పాత్ర పోషిస్తున్నదని



కొనియాడారు.ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, వైద్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# చిన్నారుల చెంతకు కలెక్టరమ్మ







**– భవిత కేంద్రాల సందర్శన.. పిల్లలకు చాక్లెట్ల పంపిణీ**

**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల అపారమైన ప్రేమను చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. బుధవారం ఆర్మూర్, నందిపేట మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్మూర్ భవిత కేంద్రానికి వెళ్లిన కలెక్టర్.. అక్కడ చిన్నారులను పేరుపేరునా పలకరిస్తూ ఆప్యాయంగా కరచాలనం చేశారు. వారితో కలిసి సరదాగా గడుపుతూ చాక్లెట్లు పంచిపెట్టారు. అనంతరం కేంద్రంలోని యాక్టివిటీ రూమ్, థెరపీ రూమ్‌లను పరిశీలించారు. పిల్లల భద్రత విషయంలో రాజీ పడొద్దు. వారిని గాయపరిచే పదునైన వస్తువులు దరిచేరనీ యకండని సిబ్బందికి హితవు పలికారు. నందిపేటలో నిర్మాణ దశలో ఉన్న భవిత కేంద్రం పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. భవన నిర్మాణం నాణ్యతతో ఉండాలని, చిన్నారుల సౌకర్యార్థం ర్యాంపు వంటి వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.
పనుల్లో జాప్యం లేకుండా వేగ వం తం చేయాలన్నారు.
ఈ పర్యటనలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా విద్యాశాఖాధికారి పి.అశోక్, ఇం జినీ రింగ్ అధికారులు రవి, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన వీడ్కోలు సమావేశం



**– విద్య గొప్పతనాన్ని వివరించిన ఎమ్ఈవో వెంకన్న**

**బీర్కూర్, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** బుధవారం మహాత్మజ్యోతిబా పూలే బీసీ గురుకుల కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి వెంకన్న పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ విద్య యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.విద్య మన జీవితాన్ని మార్చగల శక్తిగా నిలుస్తుందని, కష్టపడి చదివే విద్యార్థులకే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, విలువలు, సమయపాలన వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, గురువుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షిం చారు. వీడ్కోలు కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగి ంది.విద్యార్థులు తమఅనుభవాలను పంచుకుంటూ కళాశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.అధ్యాపకులు కూడా విద్యార్థులు ఉన్నత స్థానాలను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుకపై ఉక్కుపాదం

**– నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**: కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై యంత్రాంగం నిఘా పెంచింది. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను ఏమాత్రం సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం ఈ విషయమై అధికారులతో సమీక్షించిన ఆమె, ఇసుక అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక రవాణా అంతా మన ఇసుక వాహనం (ఆన్‌లైన్) బుకింగ్ విధానం ద్వారానే జరగాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ వే-బిల్లులు లేదా మాన్యువల్ అనుమతులు ఇవ్వకూడదని తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ పర్మిట్ లేకుండా రోడ్డుపైకి వచ్చే ఇసుక వాహనాలను సీజ్ చేసి, చట్టపరమైన కేసులు నమోదు చేయాలని సూచించారు.తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు
ఇటీవల సాలూర మండలంలో రెండు అక్రమ ఇసుక వాహనాలు పట్టుబడిన ఘటనను కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులను, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా కట్టడికి ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత తహసీల్దార్లు, పోలీసు అధికారులు తక్షణమే బాధ్యులపై కేసులు నమోదు చేయాలని వెల్లడించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కరాఖండిగా చెప్పారు.

# నెట్‌బాల్ పోటీలకు కోనసముందర్ విద్యార్థినిల ఎంపిక



**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** క్రీడా ప్రాంగణంలో కోనసముందర్ విద్యార్థినిలు మెరిశారు. తమ చురుకైన ఆటతీరుతో ప్రత్యర్థులను చిత్తు చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు బెర్తు ఖరారు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా తీర్నన్‌పల్లిలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో కమ్మర్ పల్లి మండలం జడ్పీహెచ్ఎస్ కోనసముందర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు నికిత, బి.వెన్నెల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఈ క్రీడాకారిణులు.. ఈ నెల 19 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ బి.రమేష్ గౌడ్ తెలిపారు. విద్యార్థినిల విజయంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధానోపాధ్యాయులు బి.మధుపాల్ విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మేల్ల గంగాధర్ కొనియాడారు. రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించి జిల్లా పేరు నిలబెట్టాలని ఉపాధ్యాయ బృందం, గ్రామ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందించాలి: వైద్యాధికారి రాజ్‌కుమార్



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గ్రామస్థాయిలో గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని సాలూర మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను, నిల్వ ఉన్న పౌష్టికాహార పంపిణీ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న భోజన నాణ్యతను డాక్టర్ రాజ్‌కుమార్ స్వయంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం ప్రతి లబ్ధిదారునికి సక్రమంగా అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీతో పాటు, పోషక విలువలపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించేలా తల్లులను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి, వారికి ప్రత్యేక పోషకాహారం అందేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా ఉన్నారు.

# మండల సర్పంచుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం







**బజార్హత్నూర్, ఫిబ్రవరి 18 (డిడి9వార్త న్యూస్):** -ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల సర్పంచులు బుధవారం రోజు సమావేశం అయి మండల అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ల సంఘం బజార్ హత్నూర్ మండల అధ్యక్షులుగా బజార్ హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్న, ఉపాధ్యక్షులుగా పిప్పిరి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 31 గ్రామాల సర్పంచులు ఎన్నిక అయినఅధ్యక్ష, కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు చెప్పారు. బజార్హత్నూర్ గ్రామస్తులు కూడా సర్పంచ్ సాయన్నను అభినందించారు.

# కమనీయం.. ఉమామహేశ్వరుల కళ్యాణం

**- కుర్నాపల్లిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు.. నేడు పెద్ద రథోత్సవం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కళ్యాణోత్సవాన్ని గ్రామస్థులు, భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం నుంచే ఆలయంలో పారాయణాలు, విశేష హారతులు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన కళ్యాణ మంటపంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉమామహేశ్వరుల కళ్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఐదు రోజుల పాటు సాగిన ఈ బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం గ్రామంలో పెద్ద రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ వేడుకలో సర్పంచ్ సాయిలు, సంజీవరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, కుర్నాపల్లి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ వికాసానికి సర్పంచులు నడుం బిగించాలి

**- సాలూర మండల స్థాయి సమీక్షా సమావేశంలో అధికారుల పిలుపు**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గ్రామ పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచులు ప్రాధాన్యత ఇవ్వాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి హెచ్.శ్రీనివాస్, ఇంచార్జి తహసీల్దార్ అనూష కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో సాలూర మండల పరిధిలోని సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న ఇసుక, గ్రావెల్ కొరతపై సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ అనూష స్పందిస్తూ, నిబంధనల ప్రకారం అనుమతులు పొందే విధానాన్ని వివరించారు. ప్రభుత్వ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, అక్రమ రవాణాకు తావులేకుండా పారదర్శకత పాటించాలని సూచించారు.

'సర్పంచ్ సంవాద్'తో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు


ఈ సమావేశంలో సర్పంచ్ సంవాద్ యాప్ గురించి కో-ఆర్డినేటర్ సుమన్ వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది సర్పంచులతో నేరుగా సంభాషించే అవకాశం. ఇతర గ్రామాల్లో అమలవుతున్న ఉత్తమ అభివృద్ధి నమూనాలను మన గ్రామాల్లో అమలు చేయడం. అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే సవాళ్లను సాటి సర్పంచులతో చర్చించి పరిష్కరించుకోవడం. ఈ యాప్‌లో ప్రతి సర్పంచ్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీఓ మద్దిలేటి కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మద్దిలేటితో పాటు మండల కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# 48వ వార్డు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించిన పద్మశాలి సంఘం



**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరపాలక సంస్థ 48వ వార్డు కార్పొరేటర్‌గా ఎన్నికైన పద్మశాలి ముద్దుబిడ్డ సామల ప్రసన్న సత్యపాల్ పద్మశాలి సంఘం (నర్సగౌడ్ వీధి) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. 14 పద్మశాలి సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్ అధ్యక్షతన ఈ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు దాసరి వెంకటేష్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్పొ రేటర్లు నిరంతరం కృషి చేయాలని కోరారు. పద్మశాలి సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రసన్న గారు, 48వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పెద్దపీట వేయాలని ఆయన సూచించారు. సన్మానం అనంతరం కార్పొరేటర్ సామల ప్రసన్న సత్యపాల్ మాట్లాడుతూ.. తన విజయం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వార్డులోని డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలి సంఘం సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజా సేవలో ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు, పలువురు కుల పెద్దలు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాలొన్నారు. ప్రసన్న గారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# భీమ్‌గల్ మున్సిపల్ పాలకవర్గానికి ఘన సన్మానం



**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని, ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని భీమ్‌గల్ పట్టణ సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లే నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటిలత నరసయ్య, కౌన్సిలర్లను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పతని కృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాలకవర్గం కృషి చేయాలని కోరారు. మౌలిక వసతుల కల్పనలో వివక్ష లేకుండా, పారదర్శకమైన పాలన అందించాలని సూచించారు. సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ ఎల్లవేళలా పట్టణ ప్రయోజనాల కోసం తన వంతు సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. సన్మానం అనంతరం చైర్‌పర్సన్ నాగమణి స్వామి మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో అన్ని వర్గాల సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మరియు కౌన్సిలర్లను శాలువాలు, పూలమాలలతో ఆత్మీయంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు రఘు, కోశాధికారి భూమేష్, రైటర్ రాజేశ్వర్, సలహా కమిటీ సభ్యులు,పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్య వివాహాశీ నేరం ఈ దురాచారం రూపుమాపి బాలికలకువిముక్తి కల్పించాలి





**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 18(డిడి9వార్త న్యూస్):** -బాలలుగా ఉన్నప్పుడే పెళ్లిళ్లు చేయుట నేరం కనుక ఇలాంటి

వి చేసి చిన్న వయసులోనే బాలికల జీవితంలు నాశనం కాకు ండా చూడాలని పాటలు,మాటల ద్వారా ప్రచారం చేస్తూబు ధవారం పగలు"బాల్య వివాహ విముక్తి రథం" బజార్హత్నూర్ మండల కేంద్రం కు చేరుకోంది. బాల్య వివాహాలు చేయుచున్నందున ఎందరో మంది బాలికలు తమముందు ఉన్న బంగారు భవిష్యత్తుకు దూరం కావడమే కాకుండా ఎన్నో కష్టాలు పడాల్సిన పరిస్థితిని పెద్దలు వారికి కట్టుబాట్ల పేరబహుమతులుగా ఇస్తున్నారు.ఈ దురాచారం రూపుమాపాలని పిలుపు ఇచ్చారు.చిన్న ప్రాయంలో ఎదుర్కొనే శక్తి లేక ఏమి తోచని, ఆలోచించుకొనే సమయం లేక చాలా మంది

అబలలు తనువులు చాలిస్తున్నారు.18 సంవత్సరాల పై బడిన వారికి మాత్రమే పెళ్లి ఈడు వయసు ఉంటుంది. అప్పుడు ఆలోచన కూడా చేస్తారు. చదువుకొనే వయసులో పెళ్లిళ్లు చేయవద్దని ఈ రథం ద్వారా అధికారి విజయ్, వాహన చోదకులు పోచ్చన్న లువివరించారు.బోథ్,సొనాల,ఇచ్చోడ మండ లశీలలోని పల్లెలు తిరిగి బజార్హత్నూర్ చేరుకుంది.ఇక్కడ బజార్ హాత్నూర్ తహసీల్దార్ శ్యామ్ సుందర్, డి టీ పవార్ హీరాలాల్, ఆర్ ఐ నూర్సింగ్,సెర్వేయర్ బాపూరావులు పాల్గొని స్వాగతం తెల్పి, ఇక్కడ రథం వద్దకు చేరుకొన్న పలువురు గ్రామస్తులకు బాల్య వివాహములు చేయుట నేరం అని పలువిష యాలపైఅవగాహనాకల్పించారు. అనంతరం ఈ రథం జాతర్ల మీదుగా పల్లెల్లో ప్రచారం చేస్తూ వెళ్ళింది.విముక్తి రథం ద్వారా ప్రచారం చేయుటను పలువురు ఆసక్తిగా తిలకించారు.ఆ ప్రచారంలో పాడిన పాటలు పలువురికి వినుల విందుగా అలరింప చేసింది.



## పీ ఎం శ్రీ నిధులు వెంటనే ఖర్చు చేయాలి



**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** పీ ఎం శ్రీ పాఠశాలలలో కేటాయించిన నిధులను ఈ నెల 23వ తేదీ లోపు పూర్తిగా ఖర్చు చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి యోగితా రాణా ఆదేశించారు. అన్ని పాఠశాలలలో సివిల్ వర్క్సతో పాటు ఇతర కార్యక్రమాలకు కేటాయించిన నిధులను ఆలస్యం లేకుండా వినియోగించాలని సూచించారు.బుధవారం సాయంత్రం విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్‌తో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ మరియు ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం కార్యక్రమాలు సకాలంలో అమలు చేసి, సివిల్ పనులు పూర్తి చేసి బిల్లులను ట్రెజరీకి సమర్పించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ట్రెజరీ అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తయిన పనులకు సంబంధించిన నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వారం రోజుల్లో గరిష్టంగా పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని, మొత్తం నిధుల వినియోగాన్ని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఖాఔ× ఇంజనీర్ సుబ్బారాయుడు, విద్యాశాఖ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ వికాసంలో వార్డు సభ్యుల పాత్ర కీలకం



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గ్రామ పంచాయతీల బలోపేతం పారదర్శక పాలనే ధ్యేయంగా వార్డు సభ్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మండల అధికారులు సూచించారు. బుధవారం బోధన్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీ పరిపాలనపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో పలు కీలక అంశాలపై చర్చించారు. వార్డు సభ్యులు కేవలం పేరుకే కాకుండా, వార్డు స్థాయి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. వార్డులో జరిగే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల నాణ్యతను పరిశీలించాలి. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, మురికి కాలువల శుభ్రతను పర్యవేక్షించాలి. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడడం, వీధి దీపాల నిర్వహణను నిరంతరం గమనించాలి. గ్రామ సభల్లో వార్డు సమస్యలను ప్రస్తావించి, నిధుల మంజూరుకు కృషి చేయాలని అధికారులు సూచించారు. వార్డు సభ్యులు ప్రజలకు, పంచాయతీ పాలకవర్గానికి మధ్య వారధిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** సదాశివ నగర్ మండలం తిర్మన్ పల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధ వారం ఆకస్మి కంగా పరిశీలి ంచా రు.ఈ సందర్భంగా రేషన్ దుకా ణం లో బియ్యం నిల్వలు, పం పిణీ విధానం, స్టాక్ రిజిస్టర్, విక్రయ రికా ర్డులను ఆయన పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటి ంచాలని, బియ్యం కొరత లేకుం డా సమయానికి అందుబాటులో ఉం చాలని, ప్రజలకు అందుతున్న పౌర సరఫరా సేవలు సమర్థవంతంగా అమల వ్వాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐవీ శ్రీకాంత్, సంబంధిత శాఖ అధికారులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రం, నర్సరీని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** సదాశివ నగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శిం చారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్ వారి చదువు, ఆరోగ్యం, పోషకాహారంపై ఆసక్తిగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు చెప్పిన రైమ్స్, అక్షరాలు, సంఖ్యలను శ్రద్ధగా విని వారి ఉచ్చారణ, ఆత్మవిశ్వాసం, అభ్యసన స్థాయిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆటలు, పాటల ద్వారా బోధన కొనసాగి ంచాలని, ప్రతి చిన్నారి పై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని సూచించారు.కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం, హాజరు రిజిస్టర్లు, స్టోర్ రూమ్ నిర్వహణను పరిశీలించిన ఆయన అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. చిన్నారుల అభివృద్ధికి ఆటల ద్వారా బోధన, పరిశుభ్రత, సురక్షిత వాతా వంణం కీలకమని పేర్కొన్నారు. స్టోర్ రూమ్‌లోని పోషకాహార నిల్వలను తనిఖీ చేసి పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచిం చారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషణ అభి వృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ కేంద్రాల పనితీరును మరింత మెరుగు పరచాలని అధికారులకు తెలిపారు.అనంతరం నర్సరీలను సందర్శించిన కలెక్టర్ మొక్కల పెంపకం విధానం, విత్తనాల నాణ్యత, నీటిపారుదల సౌకర్యాలు, సంరక్షణ చర్యలను పరిశీలించారు. మొక్కల సంరక్షణలో శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలని, ప్రతి దశలో నాణ్య త ప్రమాణాలు పాటించాలని సూచి ంచారు. నర్సరీల ద్వారా పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధికి కలిగే ప్రయోజనాలను వివరించి పెద్ద ఎత్తున మొక్కల ఉత్పత్తి చేసి ప్రజలకు అంద ుబా టులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన వనరులపై ఆరా తీశారు. నర్సరీల నిర్వహణ సమర్థవంతంగా ఉండేలా సమన్వ య ంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ప్రమీల, డీఆర్‌డీవో సురే ం దర్, మండల ప్రత్యేక అధికారి సతీష్, ఎంపీ డీఓ, మండల అధికారులు,
ఐసీడీఎస్ సిబ్బ ంది, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, గ్రామసభల ద్వారానే అభివృద్ధి సాధ్యమని పెంటకలాన్ సర్పంచ్ కర్లాం కళావతి అన్నారు. బుధవారం బోధన్ మండలం పెంటకలాన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వార్డుల వారీగా ఉన్న సమస్యలపై గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రజా ప్రయోజనాల కోసం ఏ విధంగా వెచ్చించాలనే అంశంపై గ్రామసభలో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామంలో ప్రధానంగా ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యను పరిష్కరించడానికి డ్రైనేజీ కాలువల నిర్మాణం, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. నిధుల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, ప్రతి పైసా ప్రజా అవసరాలకే ఖర్చు చేయాలని గ్రామస్థులు కోరారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ వికాసం కోసం వార్డు సభ్యులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని, ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగేందర్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతికతతోనే ఉజ్వల భవిష్యత్తు



**బోధన్, నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జానకంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోన్స్ అన్నారు. బుధవారం ఎడపల్లి మండలం జానకంపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్లో మండలంలోని వివిధ పాంశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ స్థానం రిషికేష్ జైతాపూర్ ప్రభుత్వ పాఠశాల, ద్వితీయ స్థానం అశ్విన్ కుర్నాపల్లి ప్రభుత్వ పాఠశాల, తృతీయ స్థానం యశ్వంత్ రాజ్ పోచారం ప్రభుత్వ పాఠశాల విజేతలుకు ప్రధానోపాధ్యాయుడు అభినందించి, వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సైన్స్‌పై పట్టు సాధించి నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భౌతిక
శాస్త్ర ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## తీర్మాన్‌పల్లి పాఠశాల సందర్శించిన జిల్లా కలెక్టర్







**కామారెడ్డి, ఫిబ్రవరి 18(డిడి9 వార్త):** సదాశివ నగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శిం చారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి చదవడం, వ్రాయడం, ఇంగ్లీష్, గణితం వంటి అం శాల్లో వారి నైపుణ్యాలను పరిశీలి ంచారు. విద్యార్థుల ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత శ్రద్ధతో చదవాలని ప్రోత్స హించారు.వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారికి బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. క్రమమైన హాజరు విద్యార్థుల విజయానికి కీలకమని పేర్కొంటూ, ఇతరులు కూడా నిరంతర హాజరు పాటించాలని సూచించారు.విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా చీఎ--44 హైవే నుంచి తీర్మాన్‌పల్లి గ్రామం వరకు రహదారి పనుల టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొత్త కాలానికి సంబంధించి విద్యుత్ కరెంట్ పోల్స్, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యా అధికారులు, ఉపాధ్యాయులు, ఎంపీడీఓ, సర్పంచ్ లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం

**- రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం**





**నిజామాబాద్ జిల్లా 18 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా మానసిక స్థితిని మెరుగు పరుచుకోవడానికి, మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి ఎంతో దోహదపడతాయని లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ప్రతినిధులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన వివిధ పాఠశాలల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఆంధ్రయ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. చిన్నతనం నుంచే ఆటలపై శ్రద్ధ వహిస్తే భవిష్యత్తులో మరిన్ని గొప్ప క్రీడల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో పాఠశాలకే కాకుండా, గ్రామానికి, మండలానికి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ ఆంధ్రయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అద్భుతమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను సన్మానించి ప్రోత్సహిస్తున్న లైన్స్ క్లబ్ సభ్యుల సేవలను ఆయన ప్రత్యేక ంగా కొనియాడారు. అనంతరం క్రీడాకారులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి రేవతి నలిమేల గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, బద్దం రాజశేఖర్, చింత ప్రదీప్, సుంకరి విజయ్, గుండోజి రవీందర్, సింగరి రాజేశ్వర్ పాల్గొన్నారు. అలాగే జడ్పీ ీ ఈటీలు, పీడీలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో వాచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సాయన్న, వివిధ పాఠశాలల ఎ పాల్గొన్నారు.